**Eenadu**

# ఒక్కో పోస్టుకు 90 మంది పోటీ!

- 4,548 కానిస్టేబుల్ పోస్టులకు 4.12 లక్షల దరఖాస్తులు
- నేటితో ముగియనున్న గడువు

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం తీవ్ర పోటీ నెలకొంది. 4,548 పోస్టుల భర్తీకి ఏపీ పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ జారీ చేయగా.. మంగళవారం సాయంత్రం నాటికి 4.12 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం దరఖాస్తుకు ఆఖరిరోజు కావడంతో మరిన్ని వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన చూస్తే ఒక్కో పోస్టు కోసం 90మందికిపైగా అభ్యర్థులు తలపడుతున్నట్లవుతుంది. దరఖాస్తుదారుల్లో 3.57 లక్షల మంది పురుషులు, 55వేల మంది మహిళా అభ్యర్థులున్నారు. చివరి రోజున మరో 10 వేల దరఖాస్తులు వచ్చే అవకాశముందని పోలీసు నియామక మండలి అధికారుల అంచనా. కర్నూలు జిల్లా నుంచి అత్యధికంగా 44వేల మంది, నెల్లూరు జిల్లా నుంచి అత్యల్పంగా 21వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల నుంచి 40వేలు, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 30వేలకు పైగా దరఖాస్తులందాయి. పోస్టుల భర్తీలో మహిళా అభ్యర్థులకు సివిల్ విభాగంలో మూడో వంతు, ఏఆర్ విభాగంలో 20శాతం రిజర్వేషను కల్పించినప్పటికీ వారి నుంచి పెద్దగా ఆసక్తి కనిపించలేదు. అభ్యర్థులకు రెండేళ్ల వయోపరిమితి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం, దానికి అనుబంధంగా పోలీసు నియామక మండలి సవరణ నోటిఫికేషన్ విడుదల చేయడంతో గత తొమ్మిది రోజుల వ్యవధిలో 1.32 లక్షల దరఖాస్తులు అందాయి. ఈ నెల 12వ తేదీన అత్యధికంగా 14వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఉద్యోగాలకు సంబంధించి నవంబరు ఆరో తేదీన ప్రాథమిక పరీక్ష నిర్వహించనున్నట్లు పోలీసు నియామక మండలి ఛైర్మన్ అతుల్‌సింగ్ తెలిపారు. అభ్యర్థులు ఆక్టోబరు 20వ తేదీ నుంచి పోలీసు నియామక మండలి వెబ్‌సైట్ ద్వారా హాల్ టిక్కెట్లు పొందొచ్చు